# త్రిగాత్రాభినయం

"ఈ నల్ల రంగు బటల సాబు వాడావుటే,
నఖీ - వాడావుటే !, ?,
ఏ - రంగునైనా అదీ తెల్లగ చేయునే,
అయ్యో, చల్లగ ఉతుకునే,
నురగ నురగ బుర బుర మని పొంగి వచ్చునే,
చెలీ దూకి వచ్చునే,
బట్టల్లో మురికంతా పారి పోవునే
ఆహా,
మెరిసిపోవునే ... ..."

అలా సాగుతుంది ఆ పాట.

దాని వరసేం నాకు నచ్చలేదు. వరసంటే ట్యూనని కాదండోయ్. ఇప్పుడు మన తెలుగు సినిమాల్లో వచ్చే చెత్త పాటలకంటే మంచి వరసే ! కాని ఏదో వెలితి ఉంది ఆ పాటలో. రికార్డింగ్ స్టూడియో మూసిన తలుపుల్లోంచి అస్పష్టంగా వస్తోంది. అయినా, రిహార్సల్స్‌లో ఆ అమ్మాయిలు మూడు నాలుగు సార్లు ఆ పాట రిపీట్ చేశారేమో నాకు కంఠతా వచ్చేసింది.

పాట సాహిత్యపరంగా ఉన్నత స్థాయిలో ఉందని మీరూ గమనించే ఉంటారు. అలాగే ట్యూన్ కూడా "కదన కుతూహలం" రాగాన్ని కొంచెం సాపు చేసి కట్టాడుట మా సంగీతం మేస్టరు. అది ఇటీవలనే మార్కెట్‌లో కనిపిస్తున్న ఓ కొత్తరకం బట్టల సబ్బు ! రేడియో, టీవీల్లో ప్రసారం చేసేందుకు ఉద్దేశించిన పాట. కోరస్ కనుక మరీ రంజుగా ఉంది. ముగ్గురు నలుగురు గృహిణులు వరసగా నూతి పళ్లెంలో కూర్చొని ఈ కొత్త బట్టల సబ్బుని మురికి పీచమడచేందుకు అస్త్రంగా ప్రయోగిస్తూ పాడతారు కాబోలు.

అలాంటి పాటలు సోలో కంటే కోరస్‌లోనే రాణిస్తాయి. కాని సినిమాల్లో హీరోయిన్ చరణాన్నీ ఎత్తుకోడం, ఆ తర్వాత దాన్నే ఆమె చెలికత్తెలు అందుకోడం, దూరాన నిద్దర మొహం వేసుకుని చెట్టు చూట్టూ తిరుగుతూ బీడీ కాలుస్తున్న హీరో మధ్యలో చురుక్కున మెరవడం ఎంతో రంజుగా ఉండే స్టాండర్డ్ పద్ధతి కదా.

అలాగే ఈ బట్టల సబ్బు పాట కూడా ముందుగా ఓ గృహిణి, ఇంకా వీలుంటే, ఓ కాలేజీ

అమ్మాయి అన్నగారింట్లో ఉండి చదువుతూ అన్నా వదినలను ఆశ్చర్యచకితుల్ని చేయడానికని, కాలేజీ నుంచి వస్తూ ఆ నల్లబట్టల సబ్బు లేదా సాబున్ - (అరవ పేరులా ఉంది కాని కాదు. సాబున్ అంటే హిందీలో సబ్బు అని అర్థం) తెస్తుంది. వస్తూనే బాత్ రూంలో కెళ్లి ఆ సబ్బుని బకెట్ నీళ్ళల్లో పడేస్తుంది. ఎర్రని తువ్వాలు ఆ సబ్బు బారిన పడగానే తెల్లగా అయిపోయి తళతళా మెరుస్తుంది. అప్పుడు ఈ పాట-మొదట్లోనే ఇచ్చానుగా-"ఈ నల్ల రంగు బట్టల సాబు వాడావులే, సఖీ, వాడావులే" అని పాడుతూ డాన్స్ మొదలుపెడుతుంది. పక్కిళ్ళలో ఉన్న ఆమె నేస్తురాళ్ళు పరుగు పరుగున వచ్చి కోరస్ అందుకుంటారు.

కాని దానికి మా దినేష్ అడ్వర్టైజ్‌మెంట్ కంపెనీ బాస్ దినేష్ రెడ్డి గారు-ఒప్పుకోలేదు "సినిమాల్ని కాపీ కొట్టే కర్మ మనకేందయ్యా? రెండు సినిమాకతల్ని అతికేసి ఓ నవల రాసి పడేసే తెలుగు నవలా రచయితల్ని రోజూ చూస్తున్నాం కదా" మనది పది మందికి ఉపకారం చేసే సంస్థ. కొత్త బట్టల సబ్బు బజార్లో కొచ్చింది. దాన్ని వాడి చూడండి అని చెప్తాం. సినిమాల్లోలాగా హీరో, హీరోయినూ, చెలికత్తెలూ ఆ బట్టల సబ్బు పట్టుకుని తైతక్కలాడుతూ పాట పాడారనుకో. ఇక ఎవడూ ఆసబ్బు మొహం చూడడు. దివాళా ఎత్తేస్తారు వాళ్లు. వాళ్ల ఉసురు తగుల్తుంది మనకి" అన్నారాయన. నేనూరుకున్నాను. అప్తరాల్ నేనెవర్ని? ఆ కంపెనీలో ఎలక్ట్రీషియన్ని. రికార్డింగ్ జరుగుతుండగా కరెంట్ పోయినా, మైకులూ, రికార్డులూ, అవీ ట్రబులిచ్చినా వెంటనే నేను వాటిని సరిచేయాలి. కాని కొంత 'కళాపోసన' తెలిసిన వాణ్ణి కనుక సజెషన్ ఇచ్చాను. రెడ్డిగారు వినలేదు. పాట సోలో కోరస్‌లా కాకుండా, ముగ్గురమ్మాయిలు ఒకేసారి మొదలెట్టి పూర్తిగా కలిసే పాడతారు.

* * *

పాటని ఓ కే చేశాడు మ్యూజిక్ డైరక్టరు. రికార్డింగ్ మొదలవుతోంది. రాత్రి ఏడున్నర అవ వచ్చింది. నేను ఇంటికి వెళ్లిపోయే టైము.

నేను స్కూటర్ స్టార్ట్ చేస్తుండగా స్టూడియో వాచ్‌మన్ గేట్ దగ్గర్నుంచి నా దగ్గరకు వచ్చి "నువ్వెక్కడికీ వెళ్ళద్దామనే? పాట పాడుతున్న వాళ్లు ఇంత రాత్రి ఎలా వెళ్తారనుకున్నావ్? ఉండు పంతులూ, పది నిమిషాలు ! వాళ్లు రాగానే బయల్దేరి బండి మీద తీసుకెళ్ళు" అన్నాడు.

"చచ్చాన్రా !" అనుకున్నాను. ఇప్పుడు స్టూడియోలో ఒక అమ్మాయి కాదు ముగ్గురున్నారు. అంటే మూడు ట్రిప్పులెయ్యాలి నా స్కూటరు. మా దినేష్‌యాడ్స్ స్టూడియోలు ఊరికి మూడు మైళ్ల అవతల ఉన్నాయి. సిటీ బస్ లేదు. అందుచేత రికార్డింగ్ ఎప్పుడైనా ఆలస్యంగా పూర్తయితే ఆర్టిస్టులను నా స్కూటర్ మీద ఇళ్ల వద్ద దిగపెట్టాలని రెడ్డిగారు నాకు ఉద్యోగం ఇచ్చినప్పుడే చెప్పారు. ఇప్పుడు దొరికి పోయాను.

నాకు ఉక్రోషం పొంగి వచ్చేసింది, బట్టల సబ్బు నురగలా. వెంటనే కూర్చొని చెడామడా ఓ కథ రాసేశాను. రెడ్డిగారి మీదే పేరు మార్చి. ఆయన ఫ్యూడల్ భావాలున్న బడా బూర్జువా. గొప్ప దాతగా పేరు పొందిన వాడు. కాని అదంతా నటన. ఎవరు వెళ్లి అడిగినా వందా,

రెండు వందలూ దానం చేస్తాడు. అదంతా నటన. వ్యవస్థ మారాలి–అలా పరపరా ఆరు పేజీల కథ రాసేసి (కంపెనీ కాగితాల మీద, కంపెనీ కవరులో) పోస్ట్ చేసేందుకు స్టాంపులు లేనందున టేబిల్ మీద ఉంచి, లాన్‌లో తిరుగుతుండగా, రికార్డింగ్ పూర్తయింది కాబోలు స్టూడియో తలుపు తెరుచుకుని ఆ అమ్మాయి వచ్చింది. నల్లగా సన్నగా ఇందాకా తను పాడిన పాటలోని బట్టల సబ్బుని గుర్తు చేస్తోంది. "మీరే కదూ స్కూటర్ మీద అమ్మాయిలని ఇళ్లకి తీసుకెళ్ళేది" అంది ఆమె.

"అవును చిట్టితల్లీ; నేనే, ఆ దౌర్భాగ్యుణ్ణి ! పిల్లి ఒక్కొక్క పిల్లనే నోట కరుచుకుని కొత్త ఇంటికి మోసుకెళ్ళినట్లు నేను మిమ్మల్ని వరసగా ఇళ్ళకి చేర్చేసరికి తెల్లారుతుంది. నీ పేరు సబ్బులక్ష్మి కదూ, మిగతా లక్ష్ములు కనపడరే? ఇంతోటి గొప్పపాటా పాడి అలిసిపోయారా వాళ్లని కూడా ఓసారి పిలు." – అన్నాను నిష్ఠూరంగా. ఈ పెట్రోల్ మండిపోతున్న కరువురోజుల్లో ఒకొక్క అమ్మాయికోసం పది కిలోమీటర్ల చొప్పున ముగ్గురికి మూడు పదులు ముప్పై కిలోమీటర్లు అంటే పది రూపాయల పెట్రోలు, గంటన్నర డ్రైవింగూ.

ఆ అమ్మాయి తెల్లమొహం వేసి నాకేసి చూస్తూ, హేండ్ బేగ్‌తో ఆటలాడుతూ "మిగతా అమ్మాయిలెవరు?" అంది కళ్లు పెద్దవి చేసి.

"వాళ్ళే ! నీతో పాటు బట్టలసబ్బు పాట పాడిన వాళ్ళు" అన్నాను గట్టిగా. ఒక్కసారిగా ఆ అమ్మాయి మొహం సిగ్గుతో చిచ్చుబుడ్డిలా కందిపోయింది. సన్నని గొంతుతో, "ఆపాట నేనొక్కర్తినే పాడాను, మీరు ముగ్గురు నలుగురు పాడా రనుకొన్నారు కదూ? నేను పాడితే అందరూ అలాగే అనుకొంటారు, పాడుతుంటే నా గొంతుక మూడు గొంతుల్లా పలుకుతుంది, పాట బాగా వచ్చిందా?" అంది. అప్పటికే దిగులు వచ్చేసింది ఆమె మాటల్లో. ఇంక కొంచెంసేపు అలా గడిస్తే ఏడుపు మొదలెట్టేలా ఉంది ఆమె వాలకం.

ఏం మాట్లాడాలో ఆమెను ఎలా ఊరడించాలో తెలీక మెలికలు తిరుగుతూ నిల్చు న్నాను.

అంతలో దినేష్‌గారు ఆఫీస్ లోంచి వచ్చి, ఆ అమ్మాయిను ఉద్దేశించి, "అందుకే కదమ్మా, అన్ని పాటలూ నీకే ఇచ్చేస్తున్నాం. నీ గొంతుక సంగీత సభల్లో పనికి రాదు కాని ఇది వ్యాపార యుగం. వ్యాపార ప్రకటనల కోసమే నువ్వు అలాంటి గొంతుకతో పుట్టావు, కాదు గొంతుకలతో ! జనం ఇంప్రెస్ అవుతారు" అని, తర్వాత నాతో.

"నీ కథ బాగుంది పంతులూ చదువుతూ నవ్వలేక చచ్చాననుకో, బలే హాస్యంగా రాస్తావు" అని ఆ కాగితాలు నా చేతిలో పెట్టాడు.

వ్యవస్థ మారాలి అంటూ నేనెంతో ఆవేదనతో రాస్తే హాస్యం అంటారేమిటీయన అని అక్కడికక్కడే దాన్ని చించిపడేసి స్కూటర్ స్టార్ట్ చేశాను.

**(కోస్తావాణి డెయిలీ– 1.11.1986)**

★